సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 14-9-2024

సంపుటి: 20 సంచిక: 147
పేజీలు: 4 వెల: రూ.1









- ఫలించిన కూన మంత్రం
- రేపటి నుంచి ప్రారంభం కానున్న బీటీ పనులు
- ప్రయాణీకులకు తప్పనున్న ఇబ్బందులు
- శ్రీకాకుళం నుంచి రాగోలు మార్గంలో కొంత జాప్యం

# ఆమదాలవలసకు 'దారి' దొరికింది!



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని మాదిరిగా తయారైంది శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వైపు వెళ్లే రోడ్డు విస్తరణ పనులు. గత పాలకులు దీన్ని పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించిన టీడీపీ నేతలు ఇప్పుడు తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రోడ్డు విస్తరణ పూర్తి చేయడానికి నానా తిప్పలు పడుతున్నారు. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వెళ్లే మార్గానికి మోక్షం కల్పించడం కోసం రోడ్డుకు ఒక వైపు ఉన్న ఎమ్మెల్యే కూన రవికుమార్, మరో కొనవైపు ఉన్న శాసన సభ్యుడు గొండు శంకర్‌లతో పాటు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, జిల్లా మంత్రి అచ్చెన్నాయుడు పడరాని పాట్లు పడుతున్నా దీనికి పరిష్కారం దొరకడంలేదు. ఇప్పటి వరకు జరిగిన పనులకు సంబంధించి పార్ట్ పేమెంట్ కింద తాను పెట్టుకున్న రూ. 14.50 కోట్లు బిల్లు చెల్లిస్తే గానీ మిగతా పనులు పూర్తి చేయడానికి తన దగ్గర పైసా లేదని కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో ఈ బిల్లు క్లియర్‌చేసే పనిని, సంబంధిత ఫైళ్లు స్వయంగా ఎమ్మెల్యే కూన రవికుమారే చంకలో పెట్టుకొని విజయవాడలో 15 రోజులు మకాం వేసి ప్రతీ టేబుల్ దగ్గర క్లియరెన్స్ తెచ్చి ట్రెజరీలో బిల్లు చెల్లింపునకు టోకెన్ తెస్తే.. చివరి నిమిషంలో ఆ పేమెంట్ నిలిచిపోయింది. ఆమదాలవలస రోడ్డు పనుల - మిగతా 4లో









































• ఎడిటోరియల్

# ఈదకపోతే వైకాపాకు మునకే

మన కోడి కూయకపోతే తెల్లారదా? అని ఒక సామెత. టీవీ ఛానెళ్లలో డిబేట్లకి తమ పార్టీ తరపున ఒక లిస్ట్ ఇచ్చింది వైకాపా. ఈ మధ్య పార్టీ అంతర్గత విషయాలను విమర్శించిన రవిచంద్రారెడ్డి పేరు అందులో లేదు. సజ్జలని విమర్శించినందువల్లే ఇది జరిగిందని సోషల్ మీడియా చర్చ. ఇదంతా కాదు కానీ, జగన్ సొంత మీడియా సాక్షి ఏం చేస్తా వుంది అని ఆలోచిస్తే అది జగన్‌కి మంచి ఎలాగూ చెప్పలేదు. అంత ధైర్యం, అంతర్గత విషయాలని విమర్శించే శక్తి ఆ మీడియాకి లేదు. ఎందుకంటే అక్కడ సొంత అభిప్రాయాలు తార్కికంగా ఆలోచించే జర్నలిస్టులు ఎవరూ లేరు. అందరికీ జీతం ఇచ్చేది జగనే కాబట్టి వాళ్లు జగన్‌ని పొగుడుతూ, వుందిలే మంచి కాలం అని పాడుతూ, జగన్ దయతలిస్తే ఉద్యోగాన్ని పొడిగించుకుంటూ, లేదంటే రిటైరై ఇంటికి దారి వెతుక్కుంటూ వుండాల్సిందే. ఈ 57 నెలలు (2029లో ఎన్నికలు) సాక్షి మీడియా ఏం చేస్తుందంటే చంద్రబాబు లోపాలు, వైఫల్యాలు, పాపాలు, మోసం ఇలాంటి పదాల మీద ఆధారపడుతూ వార్తలు వండుతూ వుంటుంది. అందులో ఉప్పుకారం వుండవు. వైకాపా అభిమానులైన కొందరు రక్తపోటు రోగులకి అది సరైన ఆహారం. లేదంటే లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం మీద రాజకీయ మజిలీ కథలు రాసుకోవాలి. పవన్ మీద రాయడానికి ఏమీ లేదు. ఎందుకంటే ఈ ఐదేళ్లు ఆయన ఏమీ చేయడనే క్లారిటీ పవన్‌కే వుంది. మరేం చేయాలి? సాక్షిని భరించాల్సిందే. అదే లేకపోతే జగన్‌కి సుప్రభాత సేవ, కీర్తనగానం చేసేవారు ఎవరూ వుండరు. ఆంధ్రజ్యోతి, ఈనాడు వదిలే గ్యాస్‌కి సరిపడా మాస్క్‌లు వైకాపా దగ్గర లేదు. తయారీ రాదు. ఆత్మాహుతి దళం లాంటి సోషల్ మీడియా వుంది కదా అంటే, వుండేది, ఇపుడంత లేదు. జగన్ కోసం బట్టలు చించుకుంటే మానం పోవాల్సిందే తప్ప, గజం సైనుగుడ్డ కూడా కొని, మన మాన సంరక్షణ చేసే అవకాశం లేదు. ఒకవేళ 2029లో అధికారంలోకి వస్తే అప్పుడు కూడా జగన్ చుట్టూ అరడజను మంది దుడ్డు కర్రలతో నిలబడి, జై జగన్ అంటే కూడా చావబాదుతారు. ఈ ఐదేళ్లు అందరికీ అనుభవమే. జనం జగన్ దగ్గరికి రాలేరు. జగన్ రారు. బటన్ ఆపరేషన్ ఫెయిల్. మిగిలింది వై నాట్ 11. కింకర్తవ్యం సాక్షి ప్రక్షాళన. వరద బురద కడిగినంత సులభం కాదు. జర్నలిస్ట్ మేనేజర్లు, మేనేజ్‌మెంట్ జర్నలిస్టులతో నిండిపోయి యాజమాన్యం కూడా ఎవరి మాస్క్ ఏంటో గుర్తించలేని స్థితి. శుభ్రమైన నాలుగు వాక్యాలు రాయలేని వాళ్లంతా పీఠాధిపతులు. ప్రక్షాళన చేతకాక పోతే ఆల్టర్‌నేటివ్ వుంది. బళ్లారి డ్రమ్స్, భజన బృందాలకి ఇంటర్వ్యూలు చేసి వాళ్లకే జర్నలిజంలో శిక్షణ ఇస్తే ఇంకా బాగా పని చేస్తారు. మీక్కావాల్సింది కూడా హార్మోనియం, మృదంగ తబలాలే కదా. ఎవరి డప్పు వారే వాయించుకుని ప్రశాంతంగా మునిగిపోవడమే. ఇక పార్టీ, ముందు విభిన్న గొంతుల్ని వినిపించనివ్వండి. నలుగురితో మాట్లాడండి, మాట్లాడనివ్వండి. చర్చ జరగనీ. అంతర్గత ప్రజాస్వామ్యానికి విలువ ఇస్తే, కోమా నుంచి కోలుకుంటుంది. లేదంటే ఆక్సిజన్ సిలిండర్లకి ఆర్డర్ ఇచ్చుకోవడమే. నిన్నగాక మొన్న పుట్టిన వైకాపాకే ప్రజాస్వామ్య లక్షణాలు లేకపోతే 40 ఏళ్ల క్రితం పుట్టిన తెలుగుదేశాన్ని విమర్శించే హక్కు మీకుందా? ఎన్ని మాట్లాడినా మీ పార్టీ కంటే తెలుగుదేశంలో ప్రజాస్వామ్య లక్షణాలు ఎక్కువ. చంద్రబాబుకి సొంత మీడియా లేదు. కానీ అంతకు మించి పనిచేసే రెండు మీడియా సంస్థలున్నాయి. చంద్రబాబుకి పరదాలు తెలియదు. అవసరానికి తగిన ఆట ఆడే శక్తిమంతుడు. ఈసారి బాబుని తట్టుకోవడం అంత సులభం కాదు, ఆరితేరాడు. పైగా అందర్నీ దూరం చేసుకుంటూ, బలహీనమైన పార్టీ నిర్మాణం వున్న ప్రస్తుత స్థితిలో అసలు సాధ్యం కాదు. వైకాపా అమాయకత్వం ఏమంటే పథకాలు ఇవ్వలేక చంద్రబాబు చతికిలపడతాడని. వీలైనంత ఎక్కువ కాలం అధికారంలో వుండడమే బాబు అసలైన పథకం. దాని ముందు ఏ పథకాన్ని లెక్కచేయడు. చత్వారం మీరు పెట్టుకుని, బాబు కంటి జబ్బులపై అత్యాశ అంచనాలు వేయకండి. ఆల్రెడీ వైకాపా వరదలో వుంది. పడవ కావాలి. పడవ వుంది కానీ, దాంట్లో గాలిలేదు. హెలికాప్టర్లు, డ్రోన్లు లేవు. చేతనయితే ఈదండి. అలా కాకుండా జైలుకు వెళ్లి పరామర్శించినా, వరద బాధితుల కోసం నీళ్లలో దిగినా జగన్‌ను చూడటానికి జనం ఎగబడుతున్నారని భావిస్తే పప్పులో కాలేసినట్టే. ఎందుకంటే.. ఈ జనం ఎన్నికలకు ముందు కూడా జగన్‌కు అలానే వచ్చారు. వైకాపా నిర్వహించిన సిద్ధం సభలకు వచ్చిన జనం అంతకు ముందు ఎప్పుడూ చరిత్రలో జరగనిది. అయినా కూడా గత ఎన్నికల్లో కేవలం 11 సీట్లే వైకాపాకు ఇచ్చారు. జనంలో జగన్‌కు క్రేజ్ తగ్గలేదని, ఈవీఎంల వల్లే ఓడిపోయామని జగన్ లాగే కేడర్ కూడా భావిస్తే పడవ మునిగిపోవడం ఖాయం.

# లింగాలవలస రైల్వేగేట్ క్లోజ్..!

- వాహనాల రాకపోకలుపై ప్రభావం - స్థానికుల ఆందోళనపై స్పందించిన మంత్రి అచ్చెన్న



(సత్యంన్యూస్, టెక్కలి)

నౌపడా–గుణుపూర్ రైల్వే ట్రాక్‌పై మండలంలోని లింగాలవలస వద్ద ఉన్న గేట్‌ను శాశ్వతంగా మూసివేయడాన్ని సుమారు 15 గ్రామాలకు చెందిన గిరిజనులు, ఇతరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం నుంచి గేట్ క్లోజ్ చేసేందుకు రైల్వే అధికారులు ప్రయత్నాలు చేయడంతో స్థానికులు మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లడంతో పనులు నిలిపేసి తాత్కాలికంగా వాయిదా వేశారు. అయితే ఎప్పటికైనా గేట్ మూసివేయడం తప్పదని రైల్వే అధికారులు హెచ్చరికతో స్థానికులు ఆందోళనలో ఉన్నారు. ఈ రైల్వేగేట్ దాటుతూ నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటా యని స్థానికులు చెబుతున్నారు. గతంలో గేట్ మూసివేస్తామన్న ప్రతిపాదనలతో రైల్వే అధికారులు ప్రయత్నాలు చేస్తే స్థానికులు అడ్డుకోవడంతో వెనక్కి తగ్గారు. స్థానిక ప్రజాప్రతినిధులుతో కలిసి ఈస్ట్‌కోస్ట్ అధికారులను, విశాఖలో డీఆర్‌ఎంను కలిసి వినతిపత్రాలు అందించారు. దీంతో మూడేళ్లపాటు ఈ గేట్ మూసివేతను తాత్కాలికంగా వాయిదా వేశారు. ప్రస్తుతం గేట్‌ను శాశ్వతంగా మూసివేసి అండర్‌పాస్ నుంచి రాకపోకలు సాగించాలని సూచించడంతో ఈగేట్ మీదుగా రాకపోకలు సాగిస్తున్న సుమారు 15గ్రామాలకు చెందిన ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లింగాలవలస పంచాయితీ పరిధిలో ఉన్న సొర్లిగాం, సవర సొర్లిగం, హరిపురం, సన్యాసిపేట, సొర్లిగంకాలనీ, సారవకోట మండలం కుర్మనాధపురం పంచాయతీ పరిధిలోని బంజీరుపేట, సవర బంజీరు పేట, మత్రిపాడు తదితర గ్రామాలకు వేళ్లేందుకు ఇదే మార్గం కావడంతో స్థానికులు ఆందోళనలో ఉన్నారు. సుమారు వెయ్యి కుటుంబాలు ఈ మార్గం ద్వారా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దీంతోపాటు ఈ మార్గంలోనే 12గ్రానైట్ పరిశ్రమలకు చెందిన లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బ్లూ గ్రానైట్ వెలికితీసే పరిశ్రమలు ఇక్కడే ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో సుమారు 1200 మంది ఉపాధి పొందుతున్నారు. వీరంతా ఈ మార్గంలోనే వాహనాల్లో రాకపోకలు చేస్తుంటారు.

### అండర్‌పాస్ ద్వారా కాకపోకలు

గేట్ ముసివేసి అండర్ పాస్ ద్వారా రాకపోకలు సాగిస్తే గ్రానైట్ వాహనాలు, భారీ యంత్రాలతోపాటు, ప్రజల నీటి అవసరాల కోసం గ్రామాల్లో వేసే బోర్‌వెల్స్‌ను తవ్వే యంత్రాలు, అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వాటిని అదుపు చేయడానికి వచ్చే ఫైరింజన్ల రాకపోకలు నిలిచిపోనున్నాయి. 15 గ్రామాల పరిధిలో సుమారు 3వేల ఎకరాల్లో వ్యవసాయం సాగవుతుంది. వరికోత యంత్రాలు రాకపోకలు నిలిచి పోనున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ అండర్ పాస్ నుంచి రాకపోకలు సాగించే ఆస్కారం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



15 గ్రామాల్లో సుమారు 600 అదివాసీ కుటుంబాలు వ్యవసాయం చేసి జీవనోపాధి పొందుతున్నాయి. వీరి ఉత్పత్తులను ఆదివాసీ గ్రామాల నుంచి సమీపంలోని పట్టణాలకు తీసుకురావడానికి అవకాశం కోల్పోతామని ఆదివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు లింగాలవలస పరిధిలో కాట్రగడ రిజర్వాయర్ ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. ఈప్రాంత వ్యవసాయ భూములకు నీరందించడానికి కాట్రగడ్డ రిజర్వాయర్ నిర్మాణం చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వాలు వద్ద ప్రతిపాదన పెట్టారు. దీన్ని ప్రభుత్వం ఆమోదించి నిర్మాణంకు చర్యలు తీసుకుంటే గేటును మూసివేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానిక మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు జోక్యం చేసుకొని రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి రైల్వేగేట్ మూసివేత ప్రక్రియకు శాశ్వత పరిష్కారం చూపించాలని స్థానికులు కోరుతున్నారు.








**మారుతి కాన్సెప్ట్ లు భలే గమ్మత్తుగా ఉంటాయి. కథ సింపుల్‌గా ఉన్నా, ట్రీట్మెంట్ వినోదాత్మకంగా ఉంటుంది. కాన్సెప్ట్‌కి కావాల్సినంత కమర్షియాలిటీ జోడించడం ఆయన స్పెషాలిటీ. అందుకే మారుతి బ్రాండ్‌తో ఒక సినిమా వస్తుందంటే అటెన్షన్ ఉంటుంది. ఇప్పుడు ఆయన పర్యవేక్షణలో వచ్చిన సినిమా 'భలే ఉన్నాడే'. ఈ సినిమాకి ప్రజెంటర్ గా ఉండటంతో పాటు స్టోరీ ఐడియా ఆయనదే. రాజ్ తరుణ్ హీరోగా కొత్త దర్శకుడు సాయి వర్ధన్ ఆ ఐడియా సినిమాగా మలిచాడు. మరి ఇంతకీ ఏమిటా కొత్త ఆలోచన? మారుతి స్టాంప్‌తో వచ్చిన ఈ సినిమా ప్రేక్షకుల్ని అలరించేలా ఉందా? చాలా కాలంగా హిట్టు కోసం ఎదురు చూస్తున్న రాజ్ తరుణ్ కి విజయం దక్కిందా?**



రాధ(రాజ్ తరుణ్) వైజాగ్‌లో శారీ డ్రాపర్. రాధ తల్లి గౌరీ(అభిరామి) బ్యాంక్ లో ఉద్యోగం చేస్తుంటారు. రాధ కొంచెం వెరైటీ. ఆడవాళ్ళకి ఆమడదూరంలో ఉంటాడు. ఇంటిపని, వంట పని చేయడంలో తల్లికి సాయం చేస్తుంటాడు. గౌరీ పని చేసే బ్యాంక్ లో కొత్తగా ఉద్యోగంలో చేరుతుంది కృష్ణ (మనిషా). లంచ్ సమయంలో గౌరీ తెచ్చిన వంటకాలు తిని రాధకి ఫ్యాన్ అయిపో తుంది. లంచ్ బాక్స్‌లో చీటీలు రాసి తన ఇష్టాల్ని రాధకి చెబుతుంటుంది. ఇద్దరూ చూసుకోకుండానే ఒకరిపై ఒకరు అభిమానం పెంచుకుంటారు. రాధ, గౌరీ కొడుకే అని తెలుసుకొని రాధతో పెళ్ళికి సిద్ధపడుతుంది కృష్ణ. ఇంతలో తనకు రాధపై అనుమానం వస్తుంది. రాధ ప్రతిసారి కృష్ణని ఫిజికల్ గా దూరం పెడుతుంటాడు. రాధలో తేడా లక్షణాలు వున్నాని గ్రహించిన కృష్ణ ఏం చేసింది? అసలు రాధ ఎందుకు కృష్ణని ఫిజికల్‌గా దూరంగా పెడుతున్నాడు? అనేది మిగతా కథ.

ముడిపెట్టేలా తయారైయింది. క్లైమాక్స్ లో తల్లీ కొడుకుల సెంటిమెంట్ బావుంది కానీ అప్పటివరకూ నడిపిన సన్నివేశాలతో సంబంధం లేకపోవడంతో ఆ ఎమోషన్‌తో ఆడియన్‌కి కనెక్షన్ రాదు. రాజ్‌తరుణ్ స్మార్ట్‌గా కనిపించాడు. తన పాత్ర వరకూ డీసెంట్‌గా చేశాడు. కొత్త అమ్మాయి మనిషా చలాకీగా కనిపించింది. అమ్మగా అభిరామి హుందాగా కనిపించింది. హైపర్ అది సింగిల్ లైనర్స్ కొన్ని పేలాయ్. మరికొన్ని నాన్ సింక్ అనిపించాయి. సింగీతం, లీలా పాత్రలు గౌరవార్థం అన్నట్టుగా వుంటాయి. నెల్లూరు సుదర్శన్ చివర్లో నవ్వించే ప్రయత్నం చేశాడు. గణేష్ కథలో యాంకర్ లాంటి పాత్ర. తనదైన డిక్షన్ తో చేశాడు. చాలా మంది నటులు కనిపిస్తారు కానీ చెప్పుకోదగ్గ పాత్రలుగా వుండవు. శేఖర్ చంద్ర పాటలు పెద్దగా కలిసిరా లేదు. ట్రిమ్ చేయదగ్గ సీన్లు చాలా కనిపిస్తాయి. నిర్మాణ విలువలు కథకు తగ్గట్టుగా వున్నాయి. చాలా రోజులుగా హిట్ కోసం ఎదుచూస్తున్నాడు రాజ్ తరుణ్. తన ఎదురు చూపుల్ని ఈ సినిమా ఇంకా పొడిగించింది.

**– తెలుగు 360.కామ్ సౌజన్యంతో...**



# మేటర్ లేదు!

ఈ సినిమా టీజర్, ట్రైలర్ లోనే ఆ ఐడియా ఏమిటనేది ప్రేక్షకుడికి తెలిసిపోతుంది. ఇలాంటప్పుడు సినిమాలో వీలైనంత తొందరగా ఐడియాని రివిల్ చేసి.. దాని తర్వాత వచ్చే కాన్ఫ్లిక్ట్ మీద మిగతా డ్రామా నడిపితే ప్రేక్షకుడు పాత్రల మీద ఎంపతైజ్ అవుతాడు. ఉదాహరణ భలే భలే మగాడివోయ్ తీసుకుందాం.. వెరీ ఫస్ట్ సీన్ లోనే హీరోకి మతి మరుపు, ప్రతి ఐదు నిమిషాలకి టాపిక్ ని మర్చిపోతాడనే చైల్డ్ ఎపిసోడ్ లోనే చెప్పేసి, దాని నుంచి వచ్చే కాన్ ఫ్లిక్ట్ పై మిగతా డ్రామా నడిపారు. చూస్తున్న ఆడియన్ నాని క్యారెక్టర్ తో ప్రేమలో పడిపోతారు. ఇలాంటి మతిమరుపోడు ఎలా తన ప్రేమని సాధించుకుంటాడో అనే సింపతి క్రియేట్ అయిపోతుంది. క్యారెక్టర్ ని డ్రైవ్ చేసే విధానం అంత ఆసక్తికరంగా వుండాలి. భలే ఉన్నాడేకే వద్దాం.. రాధ క్యారెక్టర్‌కి ఒక సమస్య వుంటుంది. అదేదో సస్పెన్ థ్రిల్లర్ లా చివరి వరకూ చెప్పరు. దాని చుట్టూ అడల్ట్ కామెడీ నడపడానికి ప్రయత్నించారు. ఈ ప్రయత్నం నవ్వుతెప్పించకపోగా ఒక దశలో చిరాకు కలిగిస్తుంది. పోనీ అసలు సమస్య రివిల్ అయ్యాక.. హీరో క్యారెక్టర్ పై ఎంపతీ వస్తుందా అంటే అదీ వుండదు. తలకి దెబ్బ తగిలితే మోకాలి కట్టుకట్టినంత తెలివిగా వుంటుందా ట్రీట్మెంట్.

ఐడియా అనేది పుస్తకానికి ముందుమాట లాంటింది. ముందుమాట అద్భుతంగా రాసినంత మాత్రాన పుస్తకంలో విషయం ఉన్నట్టు కాదు. చివరివరకూ చదివించగల క్రియేటివిటీ ప్రతిపేజీలో వుండాలి. సినిమా కూడా అంతే. ఐడియా కొత్తగా వుంటే అది టీజర్ లో ఆకట్టుకోవడానికి సరిపోతుంది. కానీ టికెట్ కొని థియేటర్ లో అడుగుపెట్టిన తర్వాత ప్రేక్షకుడ్ని లీనం చేయగల కథ, కథనాలు కుదరాలి. రంజింపచేసే సన్నివేశాల అల్లిక వుండాలి. అలాకాకుండా కేవలం ఐడియాతోనే సరిపెడితే అంతకుమించిన ట్రాజీడీ మరొకటి లేదు. భలే ఉన్నాడే లో కూడా ఇదే జరిగింది. ఈ సినిమాకి మారుతి ఇచ్చిన ఒక ఐడియా అయితే వుంది. కానీ ఆ ఐడియాతో ఏం చేయాలో దర్శకుడికి ఒక ఐడియా లేకుండాపోయింది. అదే విధి విచిత్రం.

ఫస్ట్ హాఫ్, సెకండ్ హాఫ్ అని చెప్పుకోవడానికి ఏమీ లేదు. అర్గానిక్ గా, మనస్ఫూర్తిగా నవ్వుకొద్దగ్గ సీన్లే వుండవు. ఏదో ర్యాండమ్‌గా నడిచిపోతుంటుంది. హీరో క్యారెక్టర్‌ని చాలా తప్పుడు దారిలో నడిపారు. 'లంచ్ బాక్స్' లవ్ స్టోరీ బోరింగ్. ఇంటర్వెల్ వరకూ జరిగిందంతా మీకు మీరే కితకితలు పెట్టి నవ్వుకోండనే తీరులో ఉంటుంది. పోనీ ఇంటర్వెల్ తర్వాత అద్భుతం జరిగిందా అంటే.. అదీ లేదు. ఆశ్రమం ఎపిసోడ్ అంతా తేలిపోయింది. సింగీతం, లీలా సాంసన్ లాంటి దిగ్గజాలని తీసుకొని కథలో మెటాఫర్‌గా ఏదో చెప్పేయాలని చూశారు కానీ అదేం అతకలేదు. కొన్ని సీన్లు ముతక సీన్లు రాశారు.

రచ్చరవి వయాగ్రా ట్యాబ్లెట్లు తిని ఆంబోతులా ప్రవర్తించే ఓ వికారమైన ఎపిసోడ్ వుంది. అలాంటి సీన్లులో నవ్వించాలని ఆలోచన నుంచి అర్జెంట్ గా బయటపడిపోవాలి. ఇందులో అండర్ లైన్ చేసుకొని చెప్పదగ్గ ఓ సీన్ వుంది. ఇద్దరు ప్రేమికులు. ప్రేమికుడు తన ప్రేమని వ్యక్తం చేసే ఆనందపారవశ్యంలో చేతిలో రింగ్ పట్టుకొని దూరంగా నిలబడి అమ్మాయి వంకగా ప్రేమగా చూస్తుంటాడు. ఇంతలో ఓ లారీ వచ్చి టపీమని ప్రేమికుడ్ని కొట్టేస్తుంది. తెరపై ఈ సీన్ చూసినప్పుడు 2024లో కూడా ఇలాంటి సీన్లు రాస్తున్నారా? మారుతి సమర్పణలో ఈ సీన్ బయటికి వచ్చిందా అనే ఆశ్చర్యం కలుగుతుంది.

ఈ సినిమాలో చెప్పుకోదగ్గ అంశాలు ఏమైనా ఉన్నాయా అంటే.. అది ఈ సినిమా బేసిక్ ఐడియానే. తన చిన్నప్పటి నుంచి ఓ పరిస్థితి ఎదుర్కున్న ఓ కుర్రాడు ఒక నిర్ణయం తీసుకుంటాడు. అక్కడి వరకైతే ఓకే. ఆ ఐడియాకి ఇచ్చిన ట్రీట్మెంట్ మాత్రం మోకాలికి బోడిగుండుకి



# ఏడిస్తే నీ కళ్లు నీలాలు కారేను..
# ఏడవొద్దు పాపా!

హంద్రీ ఎక్స్‌ప్రెస్.. హైదరాబాద్‌లోని కాచిగూడా నుంచి కర్నూల్‌కు ప్రతి రోజూ వస్తుంది. నాలుగు రోజుల క్రితం కూడా యధావిధిగా రాత్రి 9.30కు కర్నూల్ చేరింది. అందులో వచ్చిన ప్రయాణీకులు ఎవరిదారిన వారు వెళ్లిపోయారు. ప్రభుత్వ రైల్వే పోలీస్‌గా విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ లక్ష్మి ప్రసన్నకి అర్ధరాత్రి సమయంలో ఓ పసిగొంతు ఆర్తనాదం వినిపించింది. జాగ్రత్తగా పరిశీలించగా ఆ దీన స్వరం హంద్రీ ఎక్స్‌ప్రెస్ రైలుబోగిలోంచి వినిపిస్తున్నట్లు అర్థమైంది. వెంటనే మరో కానిస్టేబుల్ నజీర్‌కు సమాచారం అందించి తనిఖీ చేపట్టారు. బట్టలో చుట్టిపెట్టిన ఓ పసికందు ఉగ్గపట్టుకొని ఏడుస్తూ కనిపించింది. బోగీలో వేరే ఎవ్వరూ లేరు. రైల్వేస్టేషన్‌లోనూ, ఆ చుట్టుపక్క ప్రాంతంలోనూ ఎంత వెదికినా, ఎవర్ని విచారించినా ఆ పసి పాప సంబంధీకుల ఆచూకీ తెలియలేదు. కేవలం 3 రోజుల నెత్తురు గుడ్డును అలా నిర్దాక్షిణ్యంగా వదిలేసి వెళ్లారని అర్థం చేసుకోవడానికి ఎంతోసేపు పట్టలేదు.

**ఏ తల్లి కన్న బిడ్డో.. నవ మాసాలు కడుపులో మోసిన పేగు బంధాన్ని నిర్దయగా అలా వదిలి వెళ్లేందుకు మనసెలా వచ్చిందో..! అనుకుంటూ కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకొని వెళ్లారు. అప్పటికి సమయం 1.30 గంటలు అయింది. అక్కడ నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో అడ్మిట్ చేసుకున్నారు. డాక్టర్లు వెంటనే ఆ పసికూనకు ప్రాథమిక చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు.**

... తాజా కబురు ఏమంటే..

చైల్డ్‌కేర్ హెల్ప్‌లైన్ సెంటర్ ఉద్యోగి ప్రవల్లికతో పాటు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది నిరంతర సంరక్షణలో కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో సేద దీరుతోంది. ఈ క్రమంలో వీరు చూపుతున్న మానవత్వం వెలకట్టలేనిది.

...

అయితే ఇంకా కనుగుడ్లు కూడా తెరువని ఆ పసిగుడ్డును తేరిపారా చూడండి. వసివాడని ఆ పసిగుడ్డు లేవనెత్తుతున్న ప్రశ్నలు ఎన్నో ఎన్నెన్నో..? ఒంటిపై అమ్మ నెత్తుటి మరకలైన ఆరకుండానే.. అమ్మఒడిలో వెచ్చదనం ఏమిటో కూడా అనుభవం లోకి రాకుండానే.. అనాథ అయిన ఈ పసిగుడ్డు భవితవ్యం ఏమి టి? అక్కున జేర్చుకునేది ఎవరు? అప్పుడప్పుడు గుక్క పట్టుకొని ఏడు స్తూనే ఉంది. 'ఏడిస్తే నీ కళ్లు నీలాలు కారు.. ఏడవొద్దు బిడ్డా..' అని అమ్మ నోటి లాలిపాట వినిపించేది ఎవరు?

ఎవరు అండగా ఉన్నా, ఎవరు మానవీయత చూపినా, తక్షణా వసరం అయిన అమ్మదనం అందించతరమా? ఆ లోటు తీర్చడం సాధ్యమా? ఇంతకూ ఈ పాప ఎవరు? పేదరికమే శాపమై చను బాలు ఊరక అమ్మతనమే భారమైన అభాగ్యురాలి కడుపు పంటవా? ఎవరు పాపా నువ్వు? కుంతీ పుత్రికవు కాదు గదా..! అలా వదిలేసి వెళ్లిన కసాయి తల్లి ఎవరు? అంత కష్టం ఏమొచ్చింది? ఆమెను ఇంత ఘోరానికి ఉసిగొలిపిన దారుణ కారణం ఏమిటి? ఆ నికృష్టపు తండ్రి ఎవడు? కన్నతల్లి జీవించే ఉన్నదా? ఉంటే.. ఆ కన్నతల్లి చెంతకు ఎలా చేర్చాలి?

- కాశీపురం ప్రభాకర్ రెడ్డి



## కలెక్టర్‌ను కలిసి విజిలెన్స్ ఎస్పీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



శ్రీకాకుళం జిల్లా విజిలెన్స్ ఎస్పీగా పదవి బాధ్యతలు స్వీకరించిన బర్ల ప్రసాద్ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను గౌరవ పూర్వ కంగా కలిశారు. ఈ సంద ర్భంగా పుష్పగుచ్ఛం అందిం చారు.

## పైడితల్లి జాతరకు చంద్రబాబుకు ఆహ్వానం

(సత్యంన్యూస్, అమరావతి)



విజయనగరం పైడితల్లి అమ్మ వారి జాతరకు హాజరు కావాలని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడుకు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విజ్ఞప్తి చేశా రు. విజయనగరం పైడితల్లి అమ్మవారిని సీఎం సతీమణి భువనేశ్వరి దర్శించుకున్న రోజునే చంద్రబాబుకు బెయిల్ లభించిం దని, తుపాను ప్రభావిత విజయవాడలో చంద్రబాబు అంకితభావం తో చేపట్టిన సేవలకు ప్రజల్లో మంచి గుర్తింపు లభించిందని ఎంపీ కలిశెట్టి పేర్కొన్నారు. ఈమేరకు ఢిల్లీలో సీఎంను కలిసి జాతరకు ఆహ్వానించారు.

## ఏపీ వెటర్నరీ జిల్లా అసోసియేషన్‌కు కార్యవర్గం

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

ఏపీ వెటర్నరీ అసిస్టెంట్ సర్వీస్ సంఘం జిల్లా నూతన కార్యవ ర్గంను ఏకగ్రీవంగా శుక్రవారం రాష్ట్ర అధ్యక్షులు, ఎలక్షన్ ఆఫీసర్‌గా వ్యవహరించిన ఎన్.రాఘవరావు ప్రకటించారు. జిల్లా అధ్యక్షులుగా ఎం మల్లేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎ.శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్లుగా ఎన్.ధర్మేంద్రచౌదరి, బి.వెంకటేష్, బి.హేమంత్ కు మార్, కార్యదర్శగా పి.అమ్మినాయుడు, జాయింట్ సెక్రటరీలుగా టి.చిన్నబాబు, ఏ.సంతోష్, ట్రెజరర్‌గా ఎస్.సునీతను ఎంపిక చేసిన నూతన క్యారవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన కార్య వర్గం ప్రతినిధులు మాట్లాడుతూ మూడేళ్లపాటు కార్యవర్గం కొనసాగు తుందని తెలిపారు. వెటర్నరీ సహాయకుల సమస్యలపై ఉన్నతాధికా రుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లా కార్యవర్గంలో ఎంపిక చేయడం పట్ల రాష్ట్ర అధ్యక్షులకు ధన్యవాదాలు తెలుపుతూ ఎన్నికలకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



## రామ్మోహన్ నాయుడు ఎన్నికపై జామియా మసీదులో ప్రార్ధనలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆసియా, పసిఫిక్ సభ్యదేశాల చైర్మన్‌గా కింజరాపు రామ్మోహన్ నాయుడు ఎన్నిక కావడం పట్ల ముస్లిం సామాజికవర్గ నేతలు, మత పెద్దలు హర్షం ప్రకటించారు. శ్రీకాకుళం నుంచి ఎంపిగా వరుసగా మూడుసార్లు ఎన్నికై కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రిగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్న రామ్మోహన్‌నాయుడుకు 40 దేశాలతో కూడిన ఆసియా పసిఫిక్ సభ్యదేశాల చైర్మన్ పదవి వరించడం శ్రీకాకుళం జిల్లాకు, రాష్ట్రానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని జామియా మసీదులో రామ్మోహన్ నాయుడు పేరిట జామి యా మసీదు ఇమామ్, ఖాజీ అబ్దుల్ వహాబ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే రామ్మో హన్‌నాయుడు అంచెలంచెలుగా ఎదుగుతూ ఉన్నతస్థాయికి చేరుకోవ డం అభినందనీయమన్నారు. ఆయన హయాంలో జిల్లా మరింత అభివృద్ధి జరగాలని వారు ఆకాంక్షించారు. రాముకు ఆసియా, పసి ఫిక్ సభ్యదేశాల చైర్మన్ పదవి లభించడం పట్ల టీడీపీ నగర మైనార్టీ అధ్యక్షుడు షేక్ నిజాముద్దీన్, ప్రధానమంత్రి 15 సూత్రాల అమలు కమిటీ పూర్వపు సభ్యులు బహదూర్ భాషా, జిల్లా టీడీపీ మైనార్టీ నాయకులు ఎం.డి.రఫీ, జనసేన జిల్లా మైనార్టీ నాయకులు మహ మ్మద్ రఫీ, హుస్సే న్, అదిల్, రహ్మాన్, నాని, కరీమ్, షఫీ, రషీద్, ఇజాజ్ తదితరులు పాల్గొన్నారు.



## దేశం గర్వించ దగ్గ ఉద్యమనేత ఏచూరి

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

దేశం గర్వించదగ్గ ఉద్యమ నేత సీతారాం ఏచూరి మృతి కమ్యూ నిస్టు, ప్రజాతంత్ర లౌకిక ఉద్యమాలకు తీరనిలోటని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు అన్నారు. కోటబొమ్మాలి సిపిఎం మండల నాయకులు హనుమంతు ఈశ్వరరావు అధ్యక్షతన స్థానిక సిపిఎం కార్యాలయంలో పార్టీ జాతీయ కార్యదర్శి ఏచూరి సంతాపసభ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం మాట్లాడుతూ 2011లో రెడ్డీస్ లేబరేటరీస్ కార్మికుల 100 రోజుల పోరాటానికి ఏచూరి మద్దతు పలికార న్నారు. సంతాప సభలో వివిధ ప్రజా సంఘాల నాయకులు గుండ నీలన్న, బోర శ్రీను ,సనపల ఆనంద్, పొన్నానఅప్పన్న, సనపల రామా రావు, సిహెచ్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



## సమాజ సేవకులను గుర్తించటం హర్షణీయం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

జేసీఐ శ్రీకాకుళం వారోత్సవాల్లో భాగంగా రాయల్ ప్లాజాలో సమాజ సేవకులను, సంఘసేవకులను, జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన అనిల్‌కుమార్, జేసీఐ శ్రీకాకుళం గ్రీన్‌సిటీ అధ్య క్షురాలు బెండాళం వరలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కార్యదర్శి కొంక్యాన వేణుగోపాలరావు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్య క్షులు శాసపు జోగినాయుడు మాట్లాడుతూ స్వార్థం లేకుండా ఇష్ట పడి సమాజానికి ఏదో ఒక రూపంలో సేవలు అందిస్తున్న కొంత మందిని గుర్తించి జేసీఐ వారోత్సవాల్లో సత్కరించటం హర్షణీయ మన్నారు. జేసీఐ శ్రీకాకుళం వ్యవస్థాపకులు డాక్టర్ జామిభీమ శంకర్ సహకారంతో జేసీఐ సేవలు విస్తృతం చేశారని, గత 37 ఏళ్లుగా సేవలందిస్తుండటం గర్వించదగ్గ విషయమన్నారు. జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు అనిల్‌కుమార్, జేసీఐ శ్రీకాకుళం గ్రీన్‌సిటీ అధ్యక్షురాలు వరలక్ష్మి మాట్లాడుతూ జేసీఐ సేవల్లో భాగమైన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. జేఎఫ్‌పీ సురేష్ గొంప, సెనెటర్ వి.పవన్‌కుమార్, జేసీ భువనలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ప్రాజెక్ట్ చైర్‌పర్సన్ బొడిగి మధు, తమ్మినేని ఉషారాణి సహకారం మరువలేనిదన్నారు. అనంతరం డాక్టర్ ఇంజరాపు మోహన్, ఆర్ఎంపీ, చిత్రలేఖన ఉపాధ్యాయురాలు బలివాడ స్వాతి, ఐ-టెక్నీ షియన్ సుజాత, బ్లడ్ మోటివేటర్ అల్లాడ నవీన్, కోవిడ్ వారియర్స్ జి.పవన్, తవుడు, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది ఉమా శంకర్, జీఈవో ఫౌండర్ సద్గుణ, చిన్నారి ఉర్లాం ట్వింకిల్‌లను సెల్యూట్ ద సైలెంట్ వారియర్స్‌గా గుర్తించి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో జేసీఐ వ్యవస్థాపకులు డాక్టర్ జామి భీమశంకర్, డాక్టర్ పైడి సింధూర, లయన్స్ హర్షవల్లి అధ్యక్షులు హారిక ప్రసాద్, ట్రాఫిక్ జామ్ శ్రీను, వాకర్ సెంటర్ నేషనల్ ఎలక్ట్రిక్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, పూర్వ గవర్నర్ ఇందిరాప్రసాద్, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు రవిశంకర్ దేవిప్రసాద్, యోగ టీచర్ తంగి స్వాతి, నాగలక్ష్మి, జేసీస్‌లతో పాటు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

## ఏచూరి మృతి తీరని లోటు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)



కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి మరణం రైతాంగానికి, వామ పక్ష, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులకు, శ్రామిక వర్గానికి తీరని లోటని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ అన్నారు. శని వారం జిల్లా కార్యాలయంలో రైతు సంఘం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ సీతారాం ఏచూరి చిత్రప టానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మిక, కర్షక పోరాటాల మార్గదర్శి, సామ్రాజ్యవాదం, మతోన్మాదంపై రాజీ లేని యుద్ధం చేసిన పోరాట యోధుడని అన్నారు. పార్లమెంటులో ఆయన చేసిన ఒక్కో ప్రసంగం ఒక్కో వ్యాసమని, ఇంతటి గొప్పవారు దూరం కావడం బాధాకర మన్నారు. సీతారాం ఏచూరి నుంచి ఎంతో నేర్చుకోవాలని, ఆయనను ఆదర్శంగా తీసుకొని ఆశయాలు కోసం కృషి చేయడమే నిజమైన నివాళి అన్నారు. సంతాప సభలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలు రైతులు సంఘం జిల్లా కార్యదర్శి వెలమల రమణ, రైతు సంఘం జిల్లా నాయకులు బి.వాసుదేవ రావు, కె.కొండయ్య, టి.అజయ్‌కుమార్, టి.నందోడు తదితరులు పాల్గొన్నారు.

## జీవో 42ను వేంటనే రద్దుచేయాలి

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు)లో ఎయిడెడ్ అధ్యాపకులను ప్రభుత్వ కళాశాలల్లో విలీనం చేయడానికి గత ప్రభుత్వం తీసుకొచ్చిన హేతు బద్ద రహితమైన జీవో 42ను వేంటనే రద్దుచేయాలని కోరుతూ జి.సి. టి.ఎ, జి.సి.జి.టి.ఏ అధ్యాపకులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జి.సి.జి.టి.ఏ జిల్లా అధ్యక్షులు ఎస్. శశిభూషణ్ మాట్లా డుతూ జివో నెంబర్ 42 తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం తీసుకున్న అనేక నిర్ణయాల్లో ఇది ఒకటని పేర్కొన్నా రు. ఈ జీవో వల్ల రెగ్యులర్ అధ్యాపకులకు ప్రిన్సిపాల్ పదోన్నతు ల్లోనూ, బదిలీల్లోనూ తీవ్రంగా నష్టం జరుగుతుందని తెలిపారు. కార్య క్రమంలో జి.సి.టి.ఏ జిల్లా కార్యదర్శి ఢిల్లీశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయ ఐక్యు ఏ సి కోఆర్డినేటర్ హరిత,సైన్స్ విభాగధిపతి పోలినాయుడు, ఆర్ట్స్ విభాగధిపతి సిహెచ్ రామమూర్తి, కళాశాలకు చెందిన దాదాపు 40 మంది అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిర సన వ్యక్తం చేశారు.



























# సమస్యల పరిష్కారం దిశగా చర్యలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

శ్రీకాకుళం కార్పొరేషన్ విశాఖ, సాయినగర్ కాలనీలో డ్రైనేజీ, రోడ్డు సదుపాయం లేకపోవడంతో వరదనీళ్లు, వాడుకనీళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోవటంతో ఇబ్బందులు పాలవుతున్న వైనాన్ని కాలనీవాసుల అభ్యర్థన ఆ ప్రాంతాన్ని జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు, జనసేన రాష్ట్ర కార్యదర్శి పిసిని చంద్రమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ శ్రీకాకుళం కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహించడం అవసరమన్నారు. దశాబ్దాల నుంచి ప్రత్యేక అధికారుల పాలనతో కార్పొరేషన్ ప్రజలు అభివృద్ధికి నోచుకోలేకపోతోందని, కనీసం కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ల దృష్టిలో పెట్టి సమస్యలు పరిష్కారం దిశగా చొరవ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో విశాఖ సాయినగర్ కాలనీ పెద్దలు ఉప్పాడ రాజేశ్వరి, గొర్లె అనురాధ, కలగ లక్ష్మి, బొత్స సత్యానారాయణ, పి.భాస్కరరావు, ఢిల్లీశ్వరరావు, రమేష్, తారకేశ్వరరావు, కళ్యాణి రాజేష్, జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి కొండా ఉదయ్, జిల్లా సంయుక్త కార్యదర్శిలు చిట్టి భాస్కర్, కీర్తి సుశీల, జిల్లా నాయకులు జవాన్ సురేష్, ముంగి జగదీష్, స్థానిక కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# వెలమవీధిలో భారీ అన్నదానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)



నగరంలోని 26వ డివిజన్ పరిధిలోని అరసవల్లి వెలమవీధిలో శనివారం భారీ అన్నదానం జరిగింది. టీడీపీ డివిజన్ ఇన్‌ఛార్జి ఉంగటి వెంకటరమణ, ఉంగటి పాపారావుల ఆధ్వర్యంలో సుమారు 2వేల మందికి అన్నప్రసాద వితరణ నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు వెంకటరమణ తెలిపారు. కార్యక్రమానికి కమిటీ సభ్యులు వాడాడ కృష్ణ, రాయల సూర్యదీప్, అల్లు కురమయ్య, కొవ్వూరు రమణ, బాసూరు సంతోష్, వడ్డి సంతోష్, వాడాడ రామారావు, షణ్ముఖ, లక్ష్మణ, బాసూరు సాయి కృష్ణ, అరసవల్లి బాలు, వార్డు పెద్దలు సహకరించారు.

# ఆమదాలవలసకు 'దారి' దొరికింది!

మొదటిపేజీ తరువాయి

కంటే ముందు చేపట్టి పూర్తి చేసిన పనులకు గత ప్రభుత్వం పైసా కూడా విదల్చలేదని, ఇప్పుడు టీడీపీ నాయకులు తమ సొంత పనుల కోసం నిధులు విడుదల చేయించుకుంటున్నారంటూ న్యాయస్థానానికి ఒకరు వెళ్లడంతో చివరి నిమిషంలో ట్రెజరీ వద్ద పేమెంట్ ఆగిపోయింది. దీంతో మళ్లీ కథ మొదటికొచ్చింది. దీనికి తోడు ఇటీవల వర్షాలు కురవడంతో గతం కంటే దారుణంగా ఈ రోడ్డు పరిస్థితి తయారైంది. దీంతో జిల్లా టీడీపీ నాయకులకు ఇది తీరని తలనొప్పిగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు ఆనవాలే లేకుండాపోవడంతో ట్రాఫిక్ సమస్యలు కూడా ఎదురయ్యాయి. గోతుల్లో వాహనాలు దిగబడిపోవడం, భారీ వాహనాలకు కట్టర్లు విరగడంతో రోడ్డు మీదే వాహనాలు నిలిచిపోతున్నాయి. దీనివల్ల ప్రతీరోజు జనం నుంచి టీడీపీ నాయకులకు శాపనార్థాలు ఎదురవుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని కూన రవి ఏ మంత్రం వేశారో తెలియదుగానీ ఆదివారం నుంచి ఆమదాలవలస నుంచి చింతాడ వైపు వచ్చే రహదారికి తారు వేసే పనికి శ్రీకారం చుడుతున్నారు. ఎందుకంటే.. ఇక్కడ విస్తరణ పనులు ఎన్నికలకు ముందే పూర్తయిపోయాయి. ఇప్పుడు బ్లాక్‌టాప్ వేస్తే ఆ ప్రాంతానికి రెండు వరుసల రోడ్డు అందుబాటులోకి వచ్చినట్టే. ఆదివారం ప్రారంభించి ఐదు రోజుల్లో ఈ పని ముగించనున్నారు. ఇక మిగిలింది శ్రీకాకుళం నుంచి రాగోలు వెళ్లే మార్గమే. మొత్తం ఈ రోడ్డులో అత్యంత సంక్లిష్టంగా మారిన ప్రాంతం కూడా ఇదే. దీనికి మోక్షం కల్పించడానికి ఎమ్మెల్యే గొండు శంకర్ చేయని ప్రయత్నమంటూ లేదు. అసెంబ్లీలో ప్రస్తావించి నిధులు మంజూరు చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో ఇక్కడ బ్లాక్ టాప్ వేయడానికి ఎంత తారు పడుతుందని ఆమధ్య కాంట్రాక్టర్‌తో ఆరా తీశారు. అయితే ఇక్కడ కేవలం బీటీ వేసినంత మాత్రాన రోడ్డు పూర్తయినట్టు కాదని, విస్తరణ కూడా కొంతమేరకు మిగిలిపోయిందని చెప్పడంతో పార్ట్‌బిల్ పేమెంట్ కోసం ఆయన ప్రయత్నించారు. కేవలం తారు, కంకర అయితే పని అయిపోతుందనుకుంటే దాన్ని తన సొంత నిధులు వెచ్చించి చేయడానికి కూడా సిద్ధపడ్డారు. కానీ నగరం నుంచి వెళ్లే ఈ మార్గానికి ఇంకా అనేక అడ్డంకులు ఉన్నాయి. డే అండ్ నైట్ జంక్షన్ నుంచి కొత్త రోడ్డు వరకు ఆక్రమణలు తొలగించాల్సి ఉంది. ఇందులో బలగలో రోడ్డు విస్తరణ వల్ల ఇళ్లు కోల్పోతున్న వారికి పరిహారం సెటిల్ చేయాల్సిన ఆవశ్యకత ఉంది. గత ప్రభుత్వంలో ఇళ్లు కోల్పోయినవారికి డబ్బులివ్వలేమని టీడీఆర్ బాండ్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే అందుకు ప్రజలు ఏ మేరకు అంగీకరించారనేది తెలియలేదు. అందుకే ఇప్పటికిప్పుడు నగర పరిధిలో విస్తరణ అంశాన్ని పక్కన పెట్టి కొత్త రోడ్డు నుంచి రాగోలు మీదుగా వెళ్లే రోడ్డును పూర్తి చేయాలని ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారు. ఆమదాలవలసలో కూన రవి వేసిన మంత్రాన్నే శ్రీకాకుళంలో గొండు శంకర్ కూడా వేసినట్లు తెలుస్తుంది. ముందుగా విస్తరణ పూర్తయిన ప్రాంతంలో బ్లాక్ టాప్ వేశాక రాగోలు ప్రాంతంలో ఉన్న గుంతలు పూడ్చి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయనున్నారు. అయితే దీనికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. 10 కిలోమీటర్ల రోడ్డు మొత్తం నరకప్రాయం కాకుండా కనీసం చింతాడ నుంచైనా రోడ్డు బాగుంటే కొంతమేర తిట్లు తగ్గుతాయని నాయకులు భావిస్తున్నారు. కానీ కొత్త రోడ్డు దాటిన తర్వాత చర్చి వద్ద ఉన్న గెడ్డ కల్వర్టు విస్తరణ పూర్తి కానంత వరకు ఈ రోడ్డు పనులు సంపూర్ణం కానట్టే. ప్రస్తుతం ఉన్న సమస్యంతా రాగోలు, గూడెం జంక్షన్ ఏరియాలోనే. ఇక్కడ కూడా పనులు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి.

పెరుగుతున్న జనాభాకు, వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్డు విస్తరణ చేయాలని దశాబ్దకాలంగా డిమాండ్ వినిపిస్తున్నా అందుకు అనుగుణంగా పనులు ప్రారంభం కాలేదు. ఆమదాలవలస- శ్రీకాకుళం రహదారి శిథిలావస్థకు చేరి ఆరేళ్లలో సుమారు 32మంది మృత్యువాత పడ్డారు. అయినా పాలకుల్లో చలనం రాలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొత్తరోడ్డు బైపాస్ నుంచి దూసి జంక్షన్ వరకు రోడ్డు మోకాలి లోతు గోతులయ్యాయి. దీంతో వారం రోజులుగా ఈ రోడ్డు మీదుగా ప్రయాణం నరకాన్ని తలపిస్తుంది. గంటల తరబడి వాహనాలు రోడ్డుపై నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతుంది. రోడ్డు మధ్యలో భారీ వాహనాలు దిగిపోవడంతో వాటి తొలగించడానికి భారీ క్రేన్‌లు వచ్చేవరకు వాహనాలు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. ప్రజా రవాణాకు తీవ్ర విఘాతం కలుగుతుంది. ఇసుక లారీలతో పాటు స్కూల్, ప్రజారవాణా బస్సులు, ఎఫ్‌సీఐ నుంచి బియ్యం, ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి నిత్యావసరాలు తరలించే వాహనాలు, ఆమదాలవలస రోడ్డు రైల్వే స్టేషన్‌కు వచ్చే సిమెంట్, ఎరువులు లారీలతో రద్దీగా మారిపోయింది. అంతర్రాష్ట్ర కనెక్టివిటీ ఉన్న రహదారి కావడంతో భారీ వాహనాలు ఈ రోడ్డు మీదగానే రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డుపై మోకాలి లోతు గుంతలు ఏర్పడడంతో వారం రోజులుగా ట్రాఫిక్‌ను నియంత్రించడానికి సుమారు ఆరుగంటలు సమయం పడుతుంది. నగరానికి ఉద్యోగరీత్యా వచ్చినవారు, నగరం నుంచి ఉద్యోగ విధులకు వెళ్లేవారు, కాలేజీ, పాఠశాలలకు నగరానికి బస్సుల్లో వస్తున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహన చోదకులు సమస్యల వర్ణనాతీతం. అన్నివైపుల నుంచి విమర్శలు రావడంతో రోడ్డుపై పడిన గుంతల్లో రాళ్లు వేసి కప్పే ప్రయత్నాలను ఆర్ & బీ అధికారులు శుక్రవారం నుంచి ప్రారంభించారు.

### రాష్ట్రంలో దారుణమైన పరిస్థితులు

మంత్రిగా బాధ్యతలు చేపట్టి జిల్లాకు వచ్చిన రోజున అచ్చెన్నాయుడు రోడ్డు విస్తరణ అంశాన్ని ప్రస్తావించి వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడినట్టు నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో అభినందన సభలో ప్రకటించారు. అందుకు అణుగుణంగా ముందడుగు వేసినా రూ.కోట్లలో బిల్లులు పెండింగ్‌లో ఉండిపోవడం వల్ల నిలిచిపోయిన పనులను మొదలుపెట్టేందుకు కాంట్రాక్టర్లెవరూ ముందుకు రావడం లేదని గుర్తించి జిల్లాలో గోతులమయమైపోయిన రోడ్లలో ఫ్లైయాష్‌తో నింపి రోడ్లను చదును చేయాలని ఆర్ & బీ అధికారులకు సూచించారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు విస్తరణకు కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం పనులు చేపట్టనున్నట్టు జూలై 5న అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో సుడా, నగర కార్పొరేషన్, ఆర్ & బీ అధికారులతో ఎమ్మెల్యే గొండు శంకర్ సమీక్ష నిర్వహించారు. భవానీ కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యంతో రెండు గంటల పాటు చర్చించారు. జూలై 23న అసెంబ్లీలో ఎమ్మెల్యే తన మొదటి ప్రసంగంలో శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు పరిస్థితిని సభ దృష్టికి తీసుకువచ్చారు. రోడ్డు శిథిలావస్థకు చేరడం వల్ల తరచూ ప్రమాదాలు జరగడం వల్ల ఎందరో ప్రాణాలు కోల్పోయారని వివరించారు. రోడ్డు నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించి పూర్తిచేయాలని కోరారు. అయినా ఇప్పటికీ రోడ్డు పనులపై ఎటువంటి ముందడుగు పడలేదు. రాగోలు గ్రామం వద్ద ఎమ్మెల్యే శంకర్ చొరవ తీసుకోవడంతో రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చే చర్యల్లో భాగంగా రోడ్డును తొలగించి మెటల్ వేసి కొంతమేర ఎత్తు చేసి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పనులు చేశారు.

### ఇప్పటికీ పురోగతి లేదు..

అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు పరస్పరం విమర్శలు చేయడం మినహా సమస్యకు పరిష్కారం చూపించడంలో ఘోరంగా విఫలమయ్యారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు 10.4 కిలోమీటర్లు మేర శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస రోడ్డు విస్తరణ పనులు ఆరేళ్లుగా ప్రకటనలకే పరిమితమైపోయాయి. నిత్యం 10వేల వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిని గాలికొదిలేసి ఒకరిపై ఒకరు బురద చల్లుకుంటూ కాలం గడిపేస్తున్నారని విమర్శలు ప్రారంభమయ్యాయి. ఐదేళ్లలో చేయని పనిని ఆరు నెలల్లో చేసి చూపిస్తామని 2024 ఎన్నికల్లో టీడీపీ నాయకులు ఇచ్చిన హామీ ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదని గుర్తుచేస్తున్నారు. ఎన్నికల్లో ప్రధాన అజెండాగా రోడ్డు సమస్యపై ప్రచారం చేసిన ఎన్డీయే అభ్యర్థులు అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తికావచ్చినా పనుల్లో పురోగతి లేదని ఆరోపణలు గుప్పిస్తున్నారు.

# 10 వేల మందికి అన్నదానం

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

మండలంలోని ఎస్ఎంపురంలతో పాటు నగరంలోని పలు చోట్ల శనివారం 10వేల మందికి ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. నగరంలోని సంతోషిమాత కోవెల, ఫాజుల్‌బాగ్‌పేట, హయాతినగరం, అల్లినగరం తదితర ప్రాంతాల్లో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద శనివారం నిర్వహించిన అన్నదానంలో సూర శ్రీనివాసరావు భాగస్వామ్యమయ్యారు. సూరశ్రీను నేతృత్వంలో జెమ్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీను మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావనతో మానసిక శక్తి సిద్ధించడంతోపాటు సేవా దృక్పథం అలవడుతుందన్నారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో కలకాలం వర్ధిల్లాలని కోరారు. గత కొన్నేళ్లుగా ఎచ్చెర్ల, శ్రీకాకుళం నగరంలోని అనేక ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించడం తనకు ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ అన్నదానంలో సుమారు 10వేల మంది గ్రామస్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



# బాధితులకు పరామర్శకు వెళ్లి సంబరాలా..!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో వరదలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డి బాధితులను పరామర్శించడానికి వెళ్లి సంబరాలు చేసుకుంటున్నారని టీడీపీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విపత్తులో సర్వం కోల్పోయిన ప్రజలకు భరోసా కల్పించాల్సిన ప్రతిపక్ష నాయకులు బాధితులకు అండగా నిలిచిన సీఎం చంద్రబాబు, కూటమి నాయకులు, ప్రభుత్వంపై ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. వైకాపా అధినేత జగన్ మొక్కుబడి పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు. పరామర్శలు పేరుతో ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకుంటున్నారని దుయ్యబట్టారు. బాణాసంచా కాల్చి జగన్‌ను స్వాగతం పలకడాన్ని ఆక్షేపించారు.

# జాతి సమైక్యతకు హిందీ దోహదం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భారత జాతి సమైక్యానికి, తద్వారా దేశ ప్రగతికి జాతీయ భాష హిందీ ఎంతగానో దోహదపడుతుందని నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి కె.వెంకటఉజ్వల్ అన్నారు. జాతీయ హిందీ దినోత్సవం సందర్భంగా హిందీ ఫోరం శ్రీకాకుళం సారధ్యంలో శనివారం పట్టణంలో నిర్వహించిన రాజభాష హిందీ శోభాయాత్రను ఆయన ప్రారంభించారు. జాతీయ భాష హిందీ భవిష్యత్తులో విశ్వ భాషగా ఎదగాలని జిల్లా పర్యాటన అధికారి ఎన్.నారాయణరావు ఆకాంక్షించారు. హెచ్‌పీసీఎల్ విశ్రాంత జనరల్ మేనేజర్ బి.భాస్కరరావు, ఏపీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ వ్యవస్థాపకులు నటుకుల మోహన్, డాక్టర్ బాడాన దేవభూషణరావు, జనసేన జిల్లా నాయకులు పిసిని చంద్రమోహన్, హిందీ ఫోరం సమన్వయకర్తలు ఐ.సంతోష్‌కుమార్, మందపల్లి రామకృష్ణారావు, నిరంజన్, హిందీ ఉపాధ్యాయులు, హిందీ భాషాభిమానులు పాల్గొన్నారు.




# వరద బాధితులకు విరాళాల సేకరణ



(సత్యంన్యూస్, పొందూరు)

స్థానిక యంగ్ స్టార్స్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం శనివారం వాండ్రంగి కాలనీ, ఆనందపురం అగ్రహారంలలో విరాళాల సేకరణ చేపట్టారు. యూత్ క్లబ్ అధ్యక్షుడు కె.శాంతారాం, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక పక్షాన కుమిలి రాజేష్, కోరాడ రమేష్, చిత్తిరి అసిరినాయుడు, చిత్తిరి సీతన్న, పారినాయుడు, పార్వతీశం, నాగరాజు, వాండ్రంగి సర్పంచ్ ఎస్.నాగరాజు, యూత్‌క్లబ్ ప్రతినిధులు ఆట్ల చంద్రశేఖర్, గిడిజాల భాస్కరరావు, బి.జనార్ధనరావు, అల్లంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌లో సుధాకర్ ఘనత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అంతర్జాతీయ నడకవీరుడు, నగరానికి చెందిన సంజీవ్ నలినీ సుధాకర్‌కు మూడు బంగారు పతకాలు సాధించి సిక్కోలు ఖ్యాతిని చాటారు. ఇటీవల నేపాల్‌లోని రంగస్వామి అంతర్జాతీయ క్రీడా ప్రాంగణంలో జరిగిన అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో 60 ఏళ్ల లోపు నడక విభాగాల్లో పాల్గొని మూడు బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా శనివారం స్టార్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సుధాకర్‌ను వాకర్స్ అభినందించారు. రేసు నడక పోటీల్లో 3,5,10 కిలోమీటర్ల విభాగాల్లో మూడు బంగారు పతకాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి, వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థకు మంచి గుర్తింపు తెచ్చిన సుధాకర్ సేవలను పలువురు కొనియాడారు. నడవండి.. నడిపించండి.. నవ సమాజాన్ని ఆవిష్కరించండి అనే నినాదంతో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఆవిర్భవించిందని, దీన్ని సుధాకర్ సార్థకం చేసి అందరకీ ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు ఇందిరాప్రసాద్, ఎస్.జోగినాయుడు, రాడ కైలాసరావు, డాక్టర్ మంతెన వాసుదేవాచారి, గొర్ల వాసుదేవరావు, జి.లక్ష్మీ, ఎస్.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



# మెరుగైన వైద్యం అందించండమే లక్ష్యం

## - ప్రభుత్వాసుపత్రుల పట్ల విశ్వాసం పెంచేలా సేవలందించండి - జిల్లా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



(సత్యంన్యూస్, టెక్కలి)

పేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల విశ్వాసం పెంచేలా సేవలు అందించాలని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్థక శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం తన పర్యటనలో భాగంగా టెక్కలి ప్రభుత్వ అసువత్రి వద్ద నూతన మార్చురీ రూమ్, వేస్టేజ్ స్టోర్‌రూమ్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు, ఇంజనీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్లకు సోమవారం నుంచి పనులు ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ ఎక్కడా రాజీపడకుండా వైద్యరంగానికి ప్రభుత్వం తగిన సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షలు నిర్వహిస్తూ పేదలకు అందించే వైద్యసేవలపై నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వైద్యులు తమ విధులను మరింత బాధ్యతతో నిర్వహించాలని, చిన్నపాటి నిర్లక్ష్యం ఖరీదు ప్రాణం కాకూడదని ఉద్బోధించారు. ఆసుపత్రిలో లిఫ్ట్ పని చేయకపోవడం, రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసిందని, దానిపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు మంత్రి వివరణ కోరగా అధిక వత్తిడికి గురై సుమారు 20 నిమిషాల పాటు పని చేయలేదని తెలుపగా మంత్రి తక్షణం స్పందించి భవిష్యత్తులో ఇటువంటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమం అనంతరం ప్రభుత్వం ఆసుపత్రికి పక్కనే ఉన్న మత్స్యశాఖ కార్యాలయం దరిలో గోశాల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించి సరిహద్దులు వెయ్యాలన్నారు. పర్యటనలో అసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.శిమ్మన్న, డీసీహెచ్ఎస్ డాక్టర్ కళ్యాణ్ బాబు, టీడీపీ నాయకులు బగాది శేషగిరిరావు, కోళ్ల లవకుమార్, మట్ట పురుషోత్తంరావు, హనుమంతు రామకృష్ణ, లాడె శ్రీను, ప్రసాద్ రెడ్డి, మామిడి రాములు పాల్గొన్నారు.




Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.